క్లుప్తంగా

బూచేపల్లి, బైరెడ్డిని కలిసిన శ్రీనివాసరెడ్డి


బూచేపల్లికి బొకే అందిస్తున్న శ్రీనివాసరెడ్డి

తర్లుపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులైన గాయం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రాత్రి జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసి తనకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజా సమస్యలపై గళం విప్పాలని శ్రీనివాస్‌రెడ్డికి వారు సూచించారు. త్వరలో మార్కాపురంలో పర్యటిస్తానని శ్రీనివాసరెడ్డికి బైరెడ్డి హామీ ఇచ్చారు.

పీహెచ్‌సీ వైద్యురాలిగా అనూరాధ

అర్ధవీడు: అర్ధవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా డాక్టర్ పీ అనూరాధ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె తిరుపతి రుయా హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ జవహర్ కుమార్ యర్రగొండపాలేనికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూరాధ మాట్లాడుతూ పీహెచ్‌సీకి మంచి పేరు వచ్చేలా పనిచేస్తానని అన్నారు. ఆమెను డాక్టరు మోనా రసూలు, సీహెచ్‌ఓ పద్మావతి, ఫార్మసిస్టు మోహన్ రెడ్డి, వైద్యశాల సిబ్బంది అభినందించారు.

కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్


కుక్కలను వాహనంలో ఎక్కిస్తున్న టీం సభ్యులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో కుక్కల బెడద అధికం కావడంతో ఒంగోలు స్నేహ ఎనిమల్ కేర్ వారికి ఫిర్యాదు చేసినట్లు కమిషనర్ నారాయణరెడ్డి చెప్పారు. ఈ మేరకు డాగ్ క్యాచింగ్ టీం సభ్యులు వచ్చి 25 కుక్కలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో పట్టుకుని ఒంగోలు తరలించినట్లు చెప్పారు. కుక్కలన్నింటికి ఒంగోలులోని కుక్కల సంరక్షణ కేంద్రంలో సంతాన నిరోధక ఆపరేషన్(ఏబీసీ-ఎనిమల్ బర్త్ కంట్రోల్) చేస్తారన్నారు. ఆపరేషన్ అనంతరం కొన్ని రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వాటిని తదుపరి యథావిధిగా అవి పట్టుకున్న ప్రాంతాల్లోనే వదిలేస్తారని నారాయణరెడ్డి చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు పాల్గొన్నారు.

జీపు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న కాశిం, పక్కన నాసరయ్య

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం జీపు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కే ఖాశీం, సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జీపు మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాడుగలు లేక జీపుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వం పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని, స్పేర్ పార్ట్స్ కూడా సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. అర్హులైన జీపు డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రతి డ్రైవర్‌కు 5 లక్షల ఇన్సూరెన్స్ పథకం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. యూనియన్ అధ్యక్షులు అమీరుల్లాఖాన్, రామయ్య, నరసింహ, శ్రీను పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేత


ఎస్పీ నుంచి డ్రోన్ కెమెరా అందుకుంటున్న సీఐ, ఎస్సై

మార్కాపురం: పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేయడం అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మండలంలోని కోలభీమునిపాడు గ్రామానికి చెందిన పోలిరెడ్డి మంగళవారం ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి మార్కాపురం రూరల్ పోలీసుస్టేషన్ అవసరాల కోసం డ్రోన్ కెమెరా అందజేశారని సీఐ పి.సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. ఈ కెమెరాను నేరాల నియంత్రణకు, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు ఉపయోగిస్తామన్నారు. పోలిరెడ్డిని పోలీసు అధికారులు అభినందించారు.

కొలువుదీరుతున్న గణనాథులు

- నిర్వాహకులు భద్రత, బాధ్యతలు తీసుకోవాలంటున్న పోలీసులు
- పందిళ్లలో కొలువుదీరిన విగ్రహాలు
- వైభవంగా నిర్వహించనున్న వినాయక చవితి


బంక మట్టితో చేసిన ప్రతిమలతో విద్యార్థులు

బేస్తవారిపేట: వినాయ చవితి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మండల కేంద్రాల్లో ప్రతి కూడలి, వీధుల్లోను గణేష్ ఉత్సవ మండపాలు ఏర్పాటు చేస్తున్న యువకులతో సందడి నెలకొంది. ఈ పండగ వేడుకల్లో ప్రమాదాలు జరగకుండా, వివాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. వినాయక ఉత్సవ కమిటీలకు పోలీస్‌శాఖ ఇచ్చిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని బేస్తవారిపేట ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి సూచించారు. మండపాల వద్ద క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. ఉత్సవాలు ఆధ్యాత్మికతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, వినాయక విగ్రహాల నిమజ్జనంలో పోలీసుల సూచనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..

వీధుల్లో, ఖాళీ స్థలాల్లో, గోడౌన్‌లలో భారీ స్థాయిలో మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ అలంకరణలతో పాటు, స్వాగత బోర్డులు, ఫ్లెక్సీలు కడుతున్నారు. మండపాలకు అధికంగా యువతతోపాటు, మహిళలు, చిన్నారులు దర్శనానికి వస్తుంటారు. మండపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు, వేలాడే విద్యుత్ తోరణాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. వర్షాలు పడుతుండటంతో తడికాళ్లు, చేతులతో చిన్నారులు విద్యుత్ తీగలను తాకకుండా చూసుకోవాలి. తల తగలకుండా విద్యుత్ తోరణాలు ఎత్తుగా కట్టాలి. గతంలో బేస్తవారిపేటలోని నెహ్రూబజార్ చివరలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద విద్యుత్‌తీగ తగలడంతో ఇంటర్మీడియెట్ విద్యార్థి మృతిచెందాడు.

కాపలా బాధ్యత కమిటీలదే..

వినాయక మండపాల భద్రత కూడా కీలమే. పండుగ సందర్భంగా యువకుల మధ్య వివాదాలు ప్రేరేపించడానికి కొందరు ఆకతాయిలు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో వినాయక ఉత్సవాలు స్నేహపూర్వకంగా చేసుకునేలా కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో మండపాల వద్ద కొందరు కాపలా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

వాడవాడలా వినాయక మండపాలు

కొమరోలు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండల వ్యాప్తంగా కమిటీ సభ్యులు మండపాలను ఏర్పాటు చేశారు. మండపాల వద్దకు గణనాథుల విగ్రహాలు మంగళవారం మధ్యాహ్నం నుంచి తరలి వెళ్లాయి. కొమరోలులో గణేష్ విగ్రహాల తయారీ లేకపోవడంతో గిద్దలూరు, వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి విగ్రహాలను మండలంలోని పలు గ్రామాలకు తరలిస్తున్నారు. ప్రతి గ్రామంలో మండపాలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠలతో కోలాహలం

కంభం: పట్టణంలో వినాయకుడి విగ్రహాల ప్రతిష్ఠలతో కోలాహలం నెలకొంది. బుధవారం వినాయకచవితి పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం చౌక్‌సెంటర్, కందులాపురం కూడలిల్లో పూజా సామాగ్రి, పత్రి అమ్మకాలు ఊపందుకున్నాయి. వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేసుకున్న కమిటీ సభ్యులు మేళ తాళాలతో తాము ఏర్పాటు చేసుకున్న మండపాల వద్దకు తీసుకెళ్లి ప్రతిష్ఠించుకున్నారు. బుధవారం పండుగ నిర్వహించుకొని గురువారం కంభం చెరువులో నిమజ్జనం జరుపుకోనున్నారు.

ఊరు.. వాడ గణనాథులు

కొనకనమిట్ల: వినాయక చవితి పండగ సందర్భంగా పల్లెపల్లెకు గణనాథులను తరలించారు. గ్రామాల్లో అందంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడు నుంచి ఐదు, తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం చేయనున్నారు. ఈ ఏడాది పండగను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. వినాయక చవితి పండగను పురస్కరించుకుని నియోజకవర్గ అంతటా పండగ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజలు పనులను పక్కన పెట్టి వైభవంగా వినాయక చవితిని జరుపుకోవటానికి ఉత్సాహంగా కార్యక్రమాలు చేపట్టారు.


పండగకు సిద్ధంగా అరటి ఆకులు, పూలు, పూజా సామగ్రి


కంభంలో పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు


మండపాల అలంకరణకు గొడుగులు


కొమరోలులో మండపం వద్దకు తరలివెళుతున్న గణనాథుడు

మట్టి గణపతులతో పర్యావరణం

వినాయక చవితి పండగకు రంగు రంగుల గణపతులు కాకుండా మట్టి గణపతులు వాడితే పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ అన్నారు. పాఠశాలలోని బాలికలకు మట్టి గణపతులు వాడితే కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. స్థానికంగా దొరికే మట్టిని సేకరించి విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి పలు ఆకృతులతో కూడిన మట్టి గణపతులను తయారు చేశారు. వాటికి కాగితపు పూలతో అలంకరించి గణనాథులను తీర్చిదిద్దారు. మట్టి గణపయ్యలను పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ గ్రామాల్లో చిన్నారులు మట్టి గణపతులను తయారు చేస్తూ ఉత్సాహంగా కనిపించారు.

తర్లుపాడులో..

తర్లుపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు మంగళవారం చవితి-ప్రకృతి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు జట్లుగా ఏర్పడి బంకమట్టి ద్వారా గణపతి ప్రతిమలు తయారు చేశారు. బంక మట్టితో చేసిన విగ్రహాలనే పూజిస్తామని, కాలుష్య రహితంగా పండగను జరుపుకుంటామని ప్రతినబూనారు.

వెల్లివిరిసిన భక్తి భావం

మార్కాపురం టౌన్: వినాయక చవితి పండగ సందర్భంగా మార్కెట్ సెంటర్‌తో పాటు చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో పూలు, పత్రి, పూజా సామగ్రి, వినాయక ప్రతిమలు, అరటి ఆకులు, అరటి పువ్వులు, పండ్లు, తదితర పూజా సామగ్రితో పండగ వాతావరణం కనిపిస్తోంది. మామిడాకులు, తంగేడు, ఉమ్మెత్త, గరిక తదితర పత్రిని పల్లెటూర్ల నుంచి తెచ్చి అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆయా ప్రాంతాలకు రావడంతో ఒక్కసారిగా పండగ శోభ కనిపిస్తోంది.

అరవింద స్కూల్లో గణేష్ ఉత్సవాలు

పట్టణంలోని అరవింద స్కూల్లో ముందస్తు గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సి.వాణి రాధాకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలకు నృత్యాలు చేశారు


అమ్మకానికి సిద్ధంగా గణేష్ ప్రతిమలు


వినాయక పండగ సామగ్రి


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వెలగకాయలు


బేస్తవారిపేటలో వినాయక ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు


కొనకనమిట్ల: ముస్తాబైన గణేష్ మండపం


కొనకనమిట్ల: పల్లెలకు తరలిస్తున్న గణేష్ విగ్రహాలు

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు


స్టాకును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ


ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న అధికారులు


తర్లుపాడు: స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

తర్లుపాడు: రైతులకు కావాల్సిన యూరియా, ఇతర ఎరువులు ఎమ్మార్పీకంటే అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఎరువుల షాప్ యజమానులను తహశీల్దార్ కె.కిశోర్‌కుమార్, ఏఓ జ్యోత్స్నాదేవి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం తర్లుపాడులోని పలు ఎరువుల షాపులను వారు తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రికార్డులు పరిశీలించారు. స్టాక్‌బోర్డుతో పాటు ధరల పట్టికను కచ్చితంగా ప్రదర్శించాలని షాప్ యజమానులకు సూచించారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ ఎం ఆంజనేయరెడ్డి, ఏఓ విజయభాస్కర్‌రెడ్డిలు ఎరువుల షాపులు, గోడౌన్‌లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, ఇన్‌వాయిస్‌లు, ఐఎఫ్‌ఎంఎస్ స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. యూరియా అవసరమైన రైతులకు మాత్రమే ఇవ్వాలని, ఇతర ప్రాంతాలకు చెందినవారికి అమ్మవద్దని సూచించారు. ఎంఆర్‌పీకి మించి అధిక రేట్లకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓ ఫారంకు లైసెన్స్ జత చేయకపోవడంతో రూ.3,15,600 విలువైన 16.2 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాలను నిలిపేశారు.

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామాల్లోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం అధికారులు తనిఖీ చేశారు. దర్శి వ్యవసాయశాఖ ఏడీఏ కె.బాలాజీ నాయక్, స్థానిక తహసీల్దార్ ఆవుల సురేష్, ఏఓ ప్రకాష్‌రావ్‌లు ఫెర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు, ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. పెదారికట్లలోని భాగ్యలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణంలో ఓ ఫామ్ ఇంక్లూజన్ లేకుండా ఉన్న రూ.2.67 లక్షల విలువైన ఎరువులను, సల్ఫేట్, ఎంఓపీ పొటాష్ ఎరువులను సీజ్ చేశారు.

మార్కాపురం: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం తహసీల్దార్ చిరంజీవి, ఏఓ బుజికజబాయిలు తమ సిబ్బంది కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు షాపుల్లో సరైన పత్రాలు లేనందున 2,27,493 రూపాయల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొదిలి: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులైన తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేశారు. ప్రధానంగా యూరియా విక్రయిస్తున్న షాపులను తనిఖీ చేశారు. ఒక దుకాణంలో సరైన పత్రాలు లేని 2.90 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.31,900 ఉంటుందని, సరైన పత్రాలు అందచేసిన తర్వాతే వాటిని విక్రయించాలని చెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టించి రైతులకు ఎరువులు అందకుండా అధిక ధరలకు అమ్మకాలు సాగించే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్ధవీడు: మండలంలోని దొనకొండ, పెద్ద కందుకూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను రెవెన్యూ, పోలీసులు అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ చిలుకా నాగార్జునరెడ్డి, ఏఓ శివ గంగా ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దొనకొండలోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి యూరియా ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

కొమరోలు: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య తెలిపారు. కొమరోలులోని పోలీసుస్టేషన్ ఆవరణలో మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సీఐ రామకోటయ్య మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో గణేష్ మండపాల కోసం తప్పనిసరిగా పోలీసుశాఖ వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజే సౌండ్ సిస్టంకు అనుమతులు ఇవ్వడం లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై జె.నాగరాజు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

రాచర్ల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో-2 వారణాసి గిరిధర శర్మ అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మధ్యలోనే చదువును ఆపేసి పాఠశాలలకు రాకుండా ఉన్న విద్యార్థులను గుర్తించి వారు మళ్లీ పాఠశాలలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. అపార్ కార్డు పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 షేక్.మొయినుద్దీన్, రాచర్ల, అనుమలవీడు. యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాయక్, షేక్.రఫీ, షేక్.వలి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించే వినాయకుడు


అన్నా రాంబాబు


జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: విఘ్నాలు తొలగించి విజయ మార్గంలో నడిపించే వినాయకుడు అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని గణనాథుడిని కోరుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ నెల్లూరు పార్లమెంటు అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులు, కార్యకర్తలకు వినాయకచవితి శుభాకాంక్షలను తెలిపారు. మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆకాంక్షించారు.

మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణీ


గణనాథుని విగ్రహాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మార్కాపురం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు అందజేశారు. పట్టణంలోని సాయిబాబా మందిరం, నెహ్రూ బజారు, గాంధీ బజారు, కంభం రోడ్డు, పీఎస్ కాలనీ, మెయిన్ బజారు, ఎస్సీ, బీసీ కాలనీ, తూర్పు వీధి, జవహర్‌నగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, జగదీశ్వరీ థియేటర్ ఏరియా తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ బల్బులతో పందిరి ఏర్పాటు చేసి గణనాథుడిని ప్రతిష్ఠించారు. పలు చోట్ల 9 రోజుల పాటు ఈ పండగను నిర్వహిస్తుండగా కొంతమంది మూడు రోజులు, మరికొంత మంది 5 రోజులు గణేష్ పండగను జరుపుకుంటున్నారు. పలు అపార్ట్‌మెంట్లలో కూడా గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. మైత్రి రూరల్ డెవలప్‌మెంటు సెక్రటరీ టి. శివకేశవరావు ఆధ్వర్యంలో మంగళవారం మట్టివినాయక ప్రతిమలను అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జీవితం ఆదర్శం


మదర్ థెరిస్సాకు నివాళులర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు

మార్కాపురం: మదర్ థెరిస్సా జీవితం అందరికీ ఆదర్శమని కిట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రంగనాయకులు అన్నారు. మంగళవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. సమాజంలో నిరుపేదలు, అనాథలు, రోగుల కోసం ఆమె చేసిన త్యాగం ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ పీవీ అనీల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

పొదిలి: పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించడమే శ్రీవివేకానంద విద్యా సంస్థల లక్ష్యమని డైరెక్టర్లు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే సెలబ్రేషన్స్ జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన డైరెక్టర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా విద్యా సంస్థలను నెలకొల్పి విద్యాభివృద్ధిలో వారిని ప్రోత్సహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. మెరికల్లాంటి విద్యార్థులను తయారు చేస్తున్న అధ్యాపకులను అభినందించారు.